సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం ៖ 9 ៖ మార్చి ៖ 2025



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి **ఆలయానికి తరలివచ్చారు.** 8లో ▸



వన్యప్రాణుల సందడి

పాపికొండల అభయారణ్యంలో వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. ఇటీవల అడవి జంతువుల సంఖ్య పెరుగుతోందని అధికారులు అంటున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
భీమవరం	6.18	4.56
నరసాపురం	6.19	4.53
తాడేపల్లిగూడెం	6.13	5.04

న్యూస్‌రీల్

నీటి కష్టాలకు చెక్



తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లి గూడెంలో తాగు నీటి సమస్యపై 'ప్రజల నీటి కష్టాలు!' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కుళాయిలు వస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో మోటార్ల ద్వారా కొందరు అక్రమంగా నీటిని తోడుతున్నారని, దీంతో పలు ప్రాంతాలకు కుళాయి నీరు రావడం లేదని మహిళలు ఆందోళన చెందుతున్నారు. 'సాక్షి' కథనంపై స్పందించిన మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ అధికారులు కుళాయిలు వచ్చే సమయంలో ఉదయం, సాయంత్రం అరగంట సేపు విద్యుత్ సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మూడు రోజులుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కుళాయిల ద్వారా నీరందింది.

సాక్షి స్పందన

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నియామకాలు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నేతలను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర కమిటీలో వివిధ హోదాల వారీగా నియమితులైన వారు ఇలా.. మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా కర్రా జయసరిత, మహిళా విభాగం సెక్రటరీగా పాలవెల్లి మంగ, బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా దొంగ మురళీ కృష్ణ, బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా కట్టుబోయిన ప్రసాద్, బీసీ సెల్ సెక్రటరీగా కర్రి ఏసుబాబు, బీసీ సెల్ సెక్రటరీగా సందక సత్తిబాబును నియమించారు. అలాగే వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా సీరం దుర్గరాజు, వాణిజ్య విభాగం సెక్రటరీగా ఎస్.లీలా భావనారాయణ, వాణిజ్య విభాగం సెక్రటరీగా పెనుగొండ ఆదిశేష వెంకట నాగేశ్వరరావు, ఇంటలెక్చువల్స్ ఫోరం సెక్రటరీగా చోడే గోపీకృష్ణ, ఇంటలెక్చువల్స్ ఫోరం సెక్రటరీగా హరిదాసు రవీంద్రకుమార్, ఇంటలెక్చువల్స్ ఫోరం జాయింట్ సెక్రటరీగా ఎస్ఎస్ ప్రసాద్ నియమితులయ్యారు.

మహిళల స్థానం ప్రత్యేకం



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): మనదేశంలో మహిళలకు ఉన్న గౌరవం ప్రపంచంలో ఎక్కడా లేదని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం చౌక్ నుంచి మహిళా ర్యాలీని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తితో కలిసి బెలూన్లు వదిలి ఆయన ప్రారంభించారు. ర్యాలీలో మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ర్యాలీ అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకు సాగింది. జిల్లాలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు.


'వైద్యసేవ' ఉద్యోగుల విధుల బహిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10, 17, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నామని ఏపీ వైద్య సేవ ఎంప్లాయీస్ జేఏసీ సంఘ నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోందని, ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులేసిందన్నారు. ఈ పరిణామాలతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. విధుల బహిష్కరణతో పాటు జిల్లా సమన్వయకర్త అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు.

సమస్యలపై సైకిల్ యాత్ర

భీమవరం(ప్రకాశం చౌక్): పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కరించాలని, టిడ్కో కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లాలోని 20 మండలాలు, ఆరు పట్టణాల్లో సైకిల్ యాత్ర చేపట్టినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ తెలిపారు. భీమవరం టిడ్కో ఇళ్ల వద్ద గోపాలన్ ఆధ్వర్యంలో 15 మంది నాయకులతో చేపట్టిన యాత్రను రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.బలరాం ప్రారంభించారు. బలరామ్ మాట్లాడుతూ యాత్ర 17 వరకు సాగుతుందని, పేదల ఇళ్ల సమస్యలు, కాలనీల్లో సౌకర్యాలను తెలుసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

స్పౌజ్ పింఛన్లకు కొర్రీ



మొగల్లుకు చెందిన 62 ఏళ్ల భాగ్యవతి భర్త గతేడాది ఆగస్టులో చనిపోయారు. అప్పటికే ఆయన పింఛన్ తీసుకుంటుండటంతో స్పౌజ్ కోటాలో మరుసటి నెల నుంచే ఆమెకు పింఛన్ అందజేయాలి. అయితే ఆమెకు పింఛన్ రాకపోవడంతో సచివాలయానికి పలుమార్లు వెళ్లి అడిగినా స్పౌజ్ ఆప్షన్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. కానీ నవంబరులో అదే గ్రామానికి చెందిన మరో పింఛన్ లబ్ధిదారుడు మృతిచెందగా ఆయన భార్యకు పింఛన్ మంజూరైంది. ఇదేంటని సచివాలయ సిబ్బందిని అడిగితే నవంబరు నుంచి చనిపోయిన వారికి మాత్రమే ప్రభుత్వం స్పౌజ్ ఆప్షన్ ఓపెన్ చేసినట్టు చెప్పారు.

- నవంబరు నుంచి మాత్రమే కొత్తవి మంజూరు
- అంతకు ముందు చనిపోయిన వారి భార్యలకు చేకూరని లబ్ధి
- పింఛన్ తీసుకుంటూ ఏడాదిలో చనిపోయిన వారు సుమారు 9,842 మంది
- కేవలం 607 మందికి మాత్రమే స్పౌజ్ కేటగిరీలో మంజూరు
- కొత్త పింఛన్ల కోసం పెండింగ్‌లో 20 వేలకు పైగా దరఖాస్తులు

సాక్షి, భీమవరం: సూపర్ సిక్స్ అమలుకు చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం పేదలకు ఆర్థిక భరోసానిచ్చే పింఛన్లకు కొర్రీలు పెడుతోంది. పాలన చేపట్టిన పది నెలల కాలంలో కొత్త పింఛన్ల మంజూరు చేయకపోగా ముందెన్నడూ లేనివిధంగా స్పౌజ్ పింఛన్ల మంజూరుకు కటాఫ్ డేట్ పెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారుడు మృతిచెందితే మరుసటి నెల నుంచే భార్యకు పింఛన్ అందిస్తే ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది.

నవంబరు నుంచి మాత్రమే.. సాధారణంగా పింఛన్ లబ్ధిదారుడు మృతిచెందితే అతని భార్య (స్పౌజ్)కు పింఛన్ మంజూరు చేస్తారు. ఈ మేరకు పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ యాప్‌లో ఆప్షన్ ఉంటుంది. కూటమి పాలన చేపట్టిన వెంటనే సంక్షేమ పథకాలు, పౌరసేవలకు సంబంధించిన వెబ్‌సైట్లను క్లోజ్ చేయడంతో స్పౌజ్ పింఛన్ల మంజూరు నిలిచిపోయింది. ఎట్టకేలకు నవంబరులో పెన్షన్ వెబ్‌సైట్‌లో కేవలం స్పౌజ్ ఆప్షన్ మాత్రమే ఓపెన్ చేసిన కూటమి ప్రభుత్వం ఆ నెల నుంచి మృతి చెందిన వారి భార్యలకు మాత్రమే పింఛన్ మంజూరు అయ్యేలా మార్పులు చేసింది. దీంతో అంతకుముందు చనిపోయిన వారి కుటుంబాలకు ఈ పథకం వర్తించకుండా పోయింది. రెండు నెలల పాటు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయగా తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో మళ్లీ ఆప్షన్‌ను క్లోజ్ చేసేసి తాజాగా మార్చి నెల నుంచి మళ్లీ ఓపెన్ చేసింది.

స్పౌజ్ లబ్ధి కొందరికే.. నవంబరు నుంచి మాత్రమే స్పౌజ్ పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం కటాఫ్ డేట్ పెట్టడంతో అంతకు ముందు భర్తను కోల్పోయిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది జనవరి నాటికి జిల్లాలో 2,36,928 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య 2,27,086కు తగ్గింది. 9,842 మంది పింఛన్లను ప్రభుత్వం తొలగించింది. మృతిచెందిన వారి పింఛన్లు తొలగించినట్టుగా అధికారులు చెబుతున్నారు. వీరిలో 60 శాతం మంది పురుషులే ఉంటారని అంచనా. ఈ మేరకు సుమారు 5,900 మంది మృతులకు సంబంధించి వారి భార్యలకు (స్పౌజ్ కేటగిరీ) పింఛన్ మంజూరు చేయాల్సి ఉండగా కేవలం 607 మందికి మాత్రమే పింఛన్ సాయం అందిస్తుండటం గమనార్హం. మిగిలిన వారికి పింఛన్ సాయం పొందేందుకు అర్హత ఉన్నా కూటమి తీరుతో వారికి అందడం లేదు.

కొత్త పింఛన్లు మంజూరై 15 నెలలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలైల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేసేవారు. 2023 జూలై నుంచి డిసెంబరు వరకు వచ్చిన దరఖాస్తుల మేరకు గతేడాది జనవరిలో జిల్లాలో 4,274 కొత్త పింఛన్లు మంజూరు చేశారు. మరలా జూలైలో కొత్త మంజూరు రావాల్సి ఉంది. జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడగా ఇప్పటికీ పది నెలలు కావస్తున్నా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్లు కోరుతూ దాదాపు 20 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అర్హత ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో పింఛన్ లబ్ధి పొందలేకపోతున్నారు. పింఛన్ వస్తే తమ జీవనానికి ఆసరా అవుతుందని, ప్రభుత్వం చొరవ చూపాలని పేదలు కోరుతున్నారు.

ప్రగతి పథమే మహిళా శక్తికి నిదర్శనం

కలెక్టర్ నాగరాణి



మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): అన్ని రంగాల్లో మహిళలు ప్రగతి పథంలో పయనించడమే మహిళా శక్తికి నిదర్శనమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కాస్మోపాలిటిన్ క్లబ్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబంతో పాటు సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతిఒక్కరి విజయం వెనుక స్త్రీ శక్తి ఉంటుందన్నారు. మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ విద్యాభవన్స్, విష్ణు కళాశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఆర్డీఏ, మెప్మా, ఐసీడీఎస్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ స్టాల్స్ ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏఎస్‌సీపీసీ చైర్మన్ పీతల సుజాత, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి, ట్రైనీ డీఎస్పీ కె. మానస, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల విద్యతోనే దేశాభివృద్ధి

మండలి చైర్మన్ మోషేన్‌రాజు



మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళలు చదువుకుంటేనే దేశాభివృద్ధి సాధ్యమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం అంకాల ఆర్ట్ అకాడమీలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు కోడే విజయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం బాగుంటుందని, కుటుంబాలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. ఎక్కడ స్త్రీలను పూజిస్తారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో మరింత రాణిస్తారన్నారు. మనదేశంలో మహిళలకు ఉన్న గౌరవం ప్రపంచంలో ఏ దేశంలో లేదన్నారు. అనంతరం ఐదుగురు మహిళలను సత్కరించారు. పార్టీ నేతలు కోడే యుగంధర్, కామన నాగేశ్వరరావు, గాదిరాజు రామరాజు, ఏఎస్ రాజు, చిగురుపాటి సందీప్, విప్పర్తి సత్యవేణి, చవ్వాకుల సత్యనారాయణ, బొమ్మిడి శాంతి, ఇంటి సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, పాలా రాంబాబు, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌ను తుంగలో తొక్కిన కూటమి



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వీరవాసరం: సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తీవ్రంగా ఆక్షేపించారు. నవుడూరు జంక్షన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు అప్పుల ప్రచారంతో చంద్రబాబు గద్దెనెక్కారని విమర్శించారు. ఇప్పుడు శాసనసభలో ఆర్థిక మంత్రి గత ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టాను విప్పడంతో ప్రజలందరికీ చంద్రబాబు చేసిన గోబెల్స్ ప్రచారం అర్థమైందన్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ అధికారం అందుకున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, వీటిని ఎలా ఎగ్గొట్టాలనే ఆలోచన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే అని గుర్తు చేశారు. కుల, మత, వర్గాలు, పార్టీలకు అతీతంగా మాజీ సీఎం జగన్ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. గవర్నర్ ప్రసంగంలో సైతం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే ఆలోచన చేయడం దారుణమని దుయ్యబట్టారు. సంపద పెంచే మంత్రదండం ఏమీ లేదని చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలను మరోసారి తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవురు మండిపడ్డారు.

ఆస్పత్రిలో శిశువు మరణంపై వీడిన మిస్టరీ

- రాచపట్నానికి చెందిన బాలికగా గుర్తింపు
- జిల్లా వైద్యాధికారుల విచారణ



కైకలూరు సీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డీసీహెచ్ఎస్ సతీష్‌కుమార్

కై కలూరు: కై కలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) బాత్‌రూంలో ఆడ శిశువు మరణంపై మిస్టరీ శనివారం వీడింది. మృత శిశువును వదలి శుక్రవారం రాత్రి పరారైన బాలిక (17)ను పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. కై కలూరు మండలం రాచపట్నం గ్రామానికి చెందిన బాలికను లారీ డ్రైవర్ (33)గా పనిచేస్తున్న స్వయానా మేనమామ గర్భవతిని చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడం వల్ల బాత్‌రూంలో బిడ్డను ప్రసవించిన తర్వాత భయంతో బయటకు వచ్చానని పోలీసుల ఎదుట సదరు బాలిక చెప్పినట్టు తెలిసింది. ప్రస్తుతం బాలికకు కైకలూరు సీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు. బాలిక నర్సింగ్ కోర్సు చేసింది. ఆమె తండ్రి 15 ఏళ్ల క్రితం మరణించాడు. తల్లి పనులకు వెళుతూ ఒక్కగానొక్క బిడ్డను పెంచుతోంది. ఈ క్రమంలోనే మేనమామ ఆమెపై లైంగిక దాడి చేసినట్టు తెలుస్తోంది. అతను పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. ఏలూరు డీఎస్పీ ఆదేశాలతో కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వైద్యాధికారుల విచారణ

ఆడ మృత శిశువు మరణంపై కలెక్టర్ ఆదేశాలతో డీసీహెచ్ఎస్ పాల్ సతీష్‌కుమార్ కైకలూరు సీహెచ్‌సీలో శనివారం విచారణ చేపట్టారు. రాత్రి విధుల్లో ఉన్న సిబ్బందిని ఒక్కొక్కరిని విచారించారు. ఇంత ఘటన జరిగినా ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాసరావు రాకపోవడంపై మీడియా సభ్యులు ప్రశ్నిస్తే అక్కడ సిబ్బంది సెలవులో ఉన్నారని సమాధానం చెప్పారు. ప్రత్యేక అధికారితో పూర్తిస్థాయి విచారణ చేయించి ఉన్నతాధికారులకు శిశువు మరణంపై నివేదిక అందిస్తామని డీసీహెచ్ఎస్ చెప్పారు.

గురువుల్లో గుబులు

బదిలీలపై గందరగోళం

- ప్రహసనంలా బదిలీల ప్రకటన
- ఇప్పటికీ విడుదల కాని జీఓ
- ఖాళీలు, మిగులు లెక్క తేలలేదు
- యూపీలో పనిచేసే ఎస్ఏల సంగతేంటో?
- 1,450 మంది పీజీటీల భవిష్యత్ ప్రశ్నార్థకం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపడతామని కూటమి ప్రభుత్వం తెలపడంతో ఆయా వర్గాల్లో హడావుడి మొదలైంది. ఈ మేరకు ప్రభుత్వం ముసాయిదా బిల్లు విడుదల చేసి ఈనెల 7 వరకు సలహాలు, సూచనలను కోరింది. ఉపాధ్యాయుల అభ్యర్థనల మేరకు అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి గాని ప్రభుత్వం బదిలీలపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఇదిలా ఉండగా అప్పుడే బదిలీల ప్రక్రియ పూర్తిచేసినట్టు కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. దీంతో త్వరలో చేపట్టనున్న బదిలీల్లో తమకు ఏ మేరకు న్యాయం జరుగుతుందో అనే చర్చ ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు ఈసారి బదిలీల్లో స్థానచలనం తప్పదు.

విడుదల కాని జీఓ : మే నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ జీఓ విడుదల కాలేదు. మే నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయడం కష్టసాధ్యమని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చేపట్టే బదిలీల కౌన్సెలింగ్ విద్యాశాఖాధికారులకు కత్తిమీద సాములాంటిది. ఇదిలా ఉండగా జిల్లా విద్యాశాఖాధికారులు ఇటీవల సీనియార్టీ జాబితాను విడుదల చేసి ఈనెల 9లోపు అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యాలయానికి వందల సంఖ్యలో అభ్యంతరాలు వచ్చినట్టు తెలుస్తోంది.

11,391 మంది ఉపాధ్యాయులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 11,391 మంది స్కూల్ అసిస్టెంట్లు, సెకండ్ గ్రేడ్ టీచర్లు, హెచ్ఎంలు పనిచేస్తున్నారు. గతంలో జరిగిన పని సర్దుబాటులో కొందరు మిగులు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే అసలు జిల్లాలో ఖాళీ పోస్టులు ఎన్ని, మిగులు ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని వంటి వివరాలు తెలియకుండా బదిలీల ప్రక్రియ ఎలా చేపడతారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై స్పష్టత రావడానికి కాస్త సమయం పడుతుందని, ఇవన్నీ తేలే వరకూ బదిలీలకు అవకాశం ఉండదంటున్నారు.

హైస్కూల్ ప్లస్‌లు రద్దు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హైస్కూల్ ప్లస్‌లలో సుమారు 1,450 మంది ఉపాధ్యాయులు పీజీటీలుగా పనిచేస్తున్నారు. ప్రస్తుత సర్కారు వీటిని రద్దు చేయడంతో పీజీటీలను ఏం చేస్తారనే దానిపై స్పష్టత లేదు. వారికి బదిలీల్లో స్థానం కల్పిస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

'ప్రాథమికోన్నత' పరిస్థితి ఏంటో ?

కూటమి ప్రభుత్వ విధానంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడనున్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల పరిస్థితిపై గందరగోళం నెలకొంది. వారిని బేసిక్ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే ఉమ్మడి జిల్లాలో సుమారు 400 మంది స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉపాధ్యాయులుగా మారతారు. వారిలో కొత్త విధానంలో ఏర్పడే సుమారు 300 మంది మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియామకాలు పొందినా మరో 100 మంది దాకా మిగిలిపోతారు. వారి పోస్టింగ్‌లపైనా స్పష్టత రావాల్సి ఉంది.

బదిలీలపై స్పష్టత ఇవ్వాలి



ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఉపాధ్యాయుల నుంచి అందిన సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని వాటికి అనుగుణంగా నిబంధనలు మార్చాలి. విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉంది. వెంటనే దానిని సరి చేసి పారదర్శకమైన జాబితాను ప్రకటించాలి. బదిలీల చట్టం ఎప్పటికప్పుడు సవరించేలా ఉండాలి. జీఓ 117ను రద్దు చేసి తీసుకురానున్న కొత్త జీఓలో పబ్లిక్, టీచర్ నిష్పత్తిని సవరించాలి.

– గెడ్డం సుధీర్, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

హక్కులను కాలరాసేలా..



బదిలీల చట్టంలో ఉపాధ్యాయుల హక్కులను కాలరాసేలా ఉన్న 12,14 సెక్షన్లను వెంటనే రద్దు చేయాలి. బదిలీల నుంచి 70 శాతం డిజేబిలిటీ ఉన్న ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్ ఉపాధ్యాయులకు కూడా మినహాయింపు ఇవ్వాలి. ఉపాధ్యాయులు మొదటగా 3, 4 కేటగిరీల పాఠశాలలను మాత్రమే కోరుకోవాలి అనే సెక్షన్‌ను తొలగించాలి. సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో ఉన్నవారికి ముందుగా 1, 2 కేటగిరీలు కోరుకునే అవకాశం కల్పించాలి.

– మద్దుకూరి ఆదినారాయణ, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



వృద్ధురాలికి పరిహారం చెక్కు అందిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి కక్షిదారులు లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలని హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవా సదన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై కక్షిదారుల ఆలోచనా విధానంలో మార్పులు రావాలని, ఒకసారి పరిష్కారమైన కేసులను మరలా హైకోర్టులో ఫైల్ చేస్తున్నారన్నారు. లోక్ అదాలత్‌లపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కోర్టుల్లో శాశ్వత లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులో బీమా సంస్థ నుంచి రూ.26 లక్షల పరిహారం చెక్కును జస్టిస్ మన్మథరావు కక్షిదారులకు అందించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, పోక్సో స్పెషల్ జడ్జి ఎస్.ఉమాసునంద, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, 7వ అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేవీవీ బులికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

5,368 కేసుల రాజీ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరిగిన లోక్ అదాలత్‌లో 5,368 కేసులు రాజీ చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. 155 సివిల్, 132 వాహన ప్రమాద బీమా, 4,919 క్రిమినల్, 132 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు.

క్లుప్తంగా

13 గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు బాలిక


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో మైనర్ బాలిక అదృశ్యం కేసును టూటౌన్ పోలీసులు 13 గంటల్లో ఛేదించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ జయసూర్య శనివారం వివరాలు వెల్లడించారు. భీమవరం 36 వార్డు సత్యవతి నగర్‌కు చెందిన మజ్జి శ్రీను దంపతుల కుమార్తె ఈ నెల 6న మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని కేసును ఛేదించారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బాలిక అదృశ్యం అయినట్లు గుర్తించారు. రైల్వే పోలీసుల సహకారంతో బాలిక విజయవాడ వెళ్లినట్లుగా గుర్తించి అక్కడ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. బాలిక ఫొటోలు పంపించగా నిర్ధారణ చేసుకుని విజయవాడ హోంలో బాలికను ఉంచారు. ఆ తర్వాత బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు కోప్పడడంతో వెళ్లిపోయినట్లు విచారణలో తెలిందన్నారు.

రూ.5 లక్షల యానాం మద్యం స్వాధీనం


తణుకులో పట్టుబడిన మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

తణుకు అర్బన్: ఇతర రాష్ట్రాల మద్యం స్థానికంగా సరఫరా చేస్తున్న పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 43.1 లీటర్ల మద్యం సీసాలు, కారును తణుకు ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకట శ్రీనివాసరెడ్డి కదలికలపై నిఘా పెట్టిన అధికారులు శనివారం కంతేరులో కారులో ఉన్న యానాం మద్యం 209 సీసాలు, 10 టిన్ బీరులు స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టుచేశారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఆర్‌ఎస్ కుమరేశ్వరన్ వివరాలు వెల్లడిస్తూ... ముద్దాయి యానాం, గోవా ప్రాంతాల నుంచి మద్యం సీసాలను తీసుకొచ్చి స్థానికంగా డోర్ డెలివరీ చేసేవాడని చెప్పారు. గతంలో తాడేపల్లిగూడెం, భీమడోలు, దేవరపల్లి కేసుల్లో పరారీలో ఉన్నాడని తెలిపారు. సహ నిందితుడిగా కోనాల వెంకట సత్యనారాయణరెడ్డి అలియాస్ భరత్‌రెడ్డి, చిన్ని అనే వ్యక్తితోపాటు యానాంలో మద్యం సరఫరా చేస్తున్న బాదర్ల ప్రేమ్‌కుమార్‌ను గుర్తించామని త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం ధర సుమారుగా రూ. 5 లక్షలు ఉంటుందని చెప్పారు.

పాపికొండల్లో వన్యప్రాణుల సందడి


ఎలుగుబంటి


ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత



- పులి, చిరుతలు, జింకలు, దుప్పుల సంచారం
- పెరిగిన నెమళ్లు, అడవి పందుల సంఖ్య
- వేసవిలో దాహార్తి తీర్చేలా ఏర్పాట్లు


పెద్ద పులి


నెమలి


ముళ్ల పందులు

బుట్టాయగూడెం: జీవ వైవిధ్యానికి నిలయం పాపికొండల అభయారణ్యం. ఈ అభయారణ్యం పులులు, చిరుతలు, జింకలు, అడవి దున్నలతో కళకళలాడుతోంది. ఇటీవల కాలంలో అడవి జంతువుల సంఖ్య పెరగడం శుభపరిణామమని అటవీ అధికారులు చెబుతున్నారు. ఇటీవల వైల్డ్‌లైఫ్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో అనేక జంతువులు స్వేచ్ఛగా తిరుగుతూ కెమెరాకు చిక్కాయి. వాటి సంరక్షణకు వైల్డ్‌లైఫ్, ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

1.12 లక్షల హెక్టార్లలో అభయారణ్యం

1,12,500 హెక్టార్లలో పాపికొండల అభయారణ్యం విస్తరించి ఉంది. పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో పాపికొండల అభయారణ్యం పరిధిలో ఉన్న బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అటవీప్రాంతంలో వన్య ప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. వైల్డ్‌లైఫ్ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జంతువుల కదలికలు గుర్తిస్తున్నారు. జంతువుల సంరక్షణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పాపికొండల అభయారణ్యంలో ఎలుగుబంట్లు, కొండ గొర్రెలు, జింకలు, కొండచిలువలు, అడవి పందులు, అడవి దున్నలు, ఆగలి, గెద్దలు, నెమళ్లు, చిరుతలు, కురుడు పందులు, చుక్కల దుప్పులు, సాంబాలు, ముళ్ల పందులు, నక్కలు, ముంగిసలు, అడవి దున్నలు వంటివి ఉన్నాయి.


గౌర్ర గేదెలు

మూడేళ్ల క్రితం జంతు గణన

2018లో పాపికొండల అభయారణ్యంలో వైల్డ్ లైఫ్ అధికారులు జంతుగణన నిర్వహించి జంతువుల కదలికలను గుర్తించారు. 2022 జనవరిలో జంతుగణన కార్యక్రమాన్ని చేపట్టారు. పాపికొండల అభయారణ్యంలోని సుమారు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించారు. ఈ సర్వేల్లో ఏనుగులు, సింహాలు తప్ప అన్ని రకాల జంతువులు, పక్షులు, ఉభయచర జీవులను గుర్తించారు. జంతువుల సంరక్షణపై బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైల్డ్ లైఫ్ అధికారులు ప్రత్యేక గస్తీ నిర్వహించడంతో పాటు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.

స్వేచ్ఛగా తిరుగుతున్న వన్య ప్రాణులు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 2020 నాటికి పోలవరం మండలం పరిధిలోని 19 నిర్వాసిత గ్రామాలను అధికారులు ఖాళీ చేయించారు. ప్రస్తుతం ఆయా గ్రామాలు ఖాళీగా ఉండటంతో పాటు వ్యవసాయ భూముల్లో పశుగ్రాసం విపరీతంగా పెరిగింది. ఆ గ్రామాల పక్కన గోదావరి నది ఉండడంతో వన్యప్రాణుల సంచారం పెరిగింది. కొండ గొర్రెలు, నెమళ్లు, చిరుత పులులు, దుప్పులు, తదితర జంతువులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. ఇటీవల వైల్డ్‌లైఫ్ అధికారులు కొరుటూరు సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పలు జంతువులు చిక్కాయి. వాటి సంరక్షణకు కూడా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అటువైపు వచ్చే పర్యాటకులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



కౌలు రైతులకు చట్టం తేవాలి


కౌలు రైతుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య

చింతలపూడి : సమగ్ర కౌలు రైతుల చట్టం తేవాలని కోరుతూ మార్చి 17న కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. మండలంలోని సమ్మటివారిగూడెంలో శనివారం కౌలు రైతుల సంఘం సమావేశం సంకు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జమలయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం కౌలు రైతుల రక్షణ కోసం నూతన కౌలు రైతు చట్టం తెస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు చట్టం ఆచరణలోకి తీసుకు రాలేకపోయారని విమర్శించారు. రైతు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే పరిస్థితి లేదని, కౌలు రైతులకు నూతన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంక్షేమానికి బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ వేసవిలో చెరువులలో కాలువలలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి సమగ్ర పూడిక పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కౌలు రైతులు సంకు వెంకటనారాయణ, వినుకొండ శ్రీను, వనమాల శాంతారావు, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, తక్కలపాటి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

అత్తిలి: అప్పు ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమని అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు చంపుతానని బెదిరించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.ప్రేమరాజు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. శ్రీనివాసరెడ్డి భార్య జ్యోతి, జుత్తిగ గ్రామంలో ఉంటున్న తన తమ్ముడి భార్య వెలగల సరస్వతికి రూ.7 లక్షల నగదును అప్పుగా ఇచ్చింది. తిరిగి డబ్బులు అడగ్గా సరైన సమాధానం చెప్పకుండా డబ్బులు ఇవ్వనని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిందన్నారు. ఈ నెల 7న సరస్వతి, ఆమె కుటుంబ సభ్యులు పాలి గ్రామానికి వచ్చి తమను భయభ్రాంతులకు గురి చేసి చంపుతానని బెదిరించారని జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు చేసింది. సరస్వతితో పాటు సత్తి శివపార్వతి, కర్రి పుష్పావతి, జుత్తిగ పార్వతిలపై కేసు నమోదు చేసామని ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

బాలిక అదృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఉండికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక శుక్రవారం అదృశ్యమైంది. భీమవరంలో పరీక్ష రాసిన తర్వాత పరీక్ష కేంద్రం నుంచి అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ఇజ్రాయేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్ : పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పాలకొల్లు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రైల్వేగేటు సెంటర్ ప్రాంతంలో ఉంటున్న బద్దా శ్రీను (45) పెయింటింగ్ పనులు చేసేవాడు. ఒంటరిగా ఉంటున్న తనకు ఎవరూ లేరని చెప్పేవాడని స్థానికులు తెలిపారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో పడుకునేవాడని, ఎవరైనా తిండి పెడితే తినేవాడన్నారు. ఒంటరితనం భరించలేకపోతున్నానని అనేవాడని తెలిపారు. శుక్రవారం రాత్రి రైల్వే గేటు సమీపంలో ఉన్న ఓ షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారసులకు పరిహారం పరిహాసమేనా?


తండ్రికి మంజూరైన పరిహారాన్ని కూతురుకు ఇవ్వాలంటూ కోర్టు ఆర్డర్

కుక్కునూరు: పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ ఇచ్చి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం చట్ట ప్రకారం వచ్చే వాటిని కూడా రాకుండా చేయడం ఎంతవరకు న్యాయమని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ పరిహారం కోసం 2017లో నిర్వాసిత గ్రామాల్లో సర్వే నిర్వహించిన ప్రభుత్వం కుటుంబ వివరాలతో పాటు అన్ని ఆధారాలను తీసుకోని ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించేందుకు అర్హుల జాబితాను తయారు చేసింది. అర్హుల జాబితాను తయారు చేసిన వెంటనే పరిహారం చెల్లించకుండా 7 సంవత్సరాల తరువాత గత జనవరిలో ఆర్ అండ్ ఆర్ పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాల్లో జమచేసింది. ఈ మధ్య కాలంలో కరోనా వైరస్ వంటి పెను విపత్తులతో దేశవ్యాప్తంగా చాలా మంది మృతి చెందారు. విలీన మండలాల్లో కూడా పలువురు అనేక కారణాలతో మృతి చెందారు. మృతి చెందిన వారికి మంజూరైన పరిహారాన్ని వారి కుటుంబసభ్యులకు ఇవ్వాల్సింది పోయి ఆ పరిహారాన్ని రీస్టోర్ టు గవర్నమెంట్ అంటూ ఇవ్వకుండా ఎగ్గొట్టేందుకు చూడడంపై నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క 2013 భూసేకరణ చట్టం ప్రకారం కుటుంబంలో అర్హులైన నిర్వాసితుడికి మంజూరైన పరిహారాన్ని అతడు మృతి చెందితే వారి వారసులకు ఇవ్వొచ్చని పలు రాజకీయ పార్టీల నాయకులు చెబుతుండగా.. ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా రీస్టోర్ టు గవర్నమెంట్ అని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అదే ప్రభుత్వం పరిహారాన్ని వెంటనే ఇచ్చుంటే నిర్వాసితులకు న్యాయం జరిగుండేదని ప్రభుత్వం చేసిన తప్పుకు నిర్వాసితులు బలి కావాలా అని పలువురు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మృతి చెందిన వారి పరిహారాన్ని వారసులకిచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పరిహారాన్ని ఎగ్గొట్టే ప్రయత్నం



ఓ వ్యక్తి మృతి చెందితే అతనికి రావాల్సినవి వారసులకు ఇవ్వాలని చట్టం చెబుతోంది. అసైన్‌మెంట్ ల్యాండ్‌కు సంబంధించిన యజమాని మృతి చెందితే తదనంతరం అతని వారసులకు చెందుతుంది. నిర్వాసితుడు మృతి చెందాడని అతని పరిహారం గవర్నమెంట్‌కు రీస్టోర్ చేయడం పరిహారాన్ని ఎగ్గొట్టేందుకు చేసే యత్నంలో భాగమే.

ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి, ఏలూరు

కోర్టు ఆర్డర్‌ను పట్టించుకోవడం లేదు



మా నాన్న సర్వే అనంతరం అర్హుల జాబితా ప్రకటించిన తరువాత మృతి చెందాడు. మృతి చెందిన వారికి పరిహారం ఇవ్వమని చెప్పడంతో మా నాన్న పరిహారాన్ని వారసురాలైన మా చెల్లికి ఇవ్వాలని కోరుతూ కోర్టుకు వెళ్లి కోర్టు ఆర్డర్ తీసుకొచ్చాను. అయినా అధికారులు కనీసం కోర్టు ఆర్డర్ కూడా పరిగణలోకి తీసుకోవడం లేదు.

ఘంటసాల చంద్రం, నిర్వాసితుడు, కుక్కునూరు

చినవెంకన్న క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


శ్రీవారి ఆలయంలో భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల : చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఎటుచూసినా భక్తులతో కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో రద్దీగా మారాయి. ఉచిత అన్నప్రసాదం కోసం వకుళమాత నిత్యాన్నదాన భవనం వద్ద భక్తులు బారులు తీరారు. పార్కింగ్ ప్రదేశాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. శ్రీహరి కళాతోరణం ప్రాంతంలో పలువురు బాలలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

సాయంకాలార్చన సమయంలో మార్పు

శ్రీవారి ఆలయంలో ఈ నెల 14 నుంచి స్వామివారి సాయంకాలార్చన సమయాన్ని మార్పు చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నారని.. ఈ నెల 14 నుంచి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహిస్తారని ఈఓ తెలిపారు. అర్చన జరిగే సమయంలో స్వామి దర్శనం ఉండదని, అర్చన ముగిసన తరువాత రాత్రి 7 గంటల నుంచి తిరిగి శ్రీవారి దర్శన భాగ్యం భక్తులకు కలుగుతుందన్నారు.

విదేశీ కోకో దిగుమతులు ఆపాలి


విజయరాయిలో కోకో గింజలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

పెదవేగి : విదేశీ కోకో గింజల దిగుమతులు వెంటనే నిలుపుదల చేయాలని, రైతులు వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పెదవేగి మండలం విజయరాయి, గాంధీ నగర్ షిరిడి సాయి కల్యాణ మండపంలో కోకో రైతుల ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశాల నుంచి కోకో గింజలు దిగుమతి చేసుకున్నామని, రైతులు వద్ద నుంచి తగినంతగా కోకో గింజలు కొనుగోలు చేయలేమని కొన్ని కంపెనీలు రైతులను బెదిరించడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వకుండా కంపెనీలు రైతులను మోసగిస్తూ ఇబ్బందులు గురి చేయడం అన్యాయమని విమర్శించారు. కిలో కోకోకు రూ.900 ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న జరిగిన కోకో రైతుల చలో ఏలూరు కార్యక్రమం సందర్భంగా కోకో రైతుల సమస్యలను కలెక్టర్‌కు వివరించామని చెప్పారు. ఈ నెల 10న ఉద్యాన శాఖ కమిషనర్ దృష్టికి సమస్య తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం వద్దకు కోకో రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోకో రైతుల సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, కోనేరు సతీష్, గుడిబండి రమేష్ రెడ్డి, ఎ.అనిల్ కుమార్, కె.రామిరెడ్డి, కె.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

రూ.32 లక్షలకు సమాధానం చెప్పండి

కైకరం పంచాయతీలో అక్రమాలపై నోటీసులు

ఉంగుటూరు : కైకరం పంచాయతీలో అవకతవకలపై విచారణ కొలిక్కి వచ్చింది. పంచాయతీ నిధులు దుర్వినియోగంపై అప్పటి కార్యదర్శి నాగేంద్ర, సర్పంచి గోపిని బాధ్యుల్ని చేస్తూ సుమారు రూ.32 లక్షలకు జవాబు చెప్పాలంటూ నోటీసులు ఇచ్చారు. ఇక నుంచి నిధుల ఖర్చుకు సర్పంచ్, కార్యదర్శితో పాటు ఈవోపీఆర్‌డి సంతకం చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఇంటి పన్నులు, బ్లీచింగ్, ఎలక్ట్రికల్ సామాన్ల కొనుగోలుకు సంబంధించి దొంగ రసీదులు పెట్టి సర్పంచి సలగల గోపి, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారంటూ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంజి ప్రభాకరరావు స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు విచారణకు రాకుండా అడ్డుకున్నారు. దాంతో ప్రభాకరరావు మళ్లీ స్పందనలో రెండోసారి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ పూర్తి స్థాయిలో పూర్తి కాకుండానే ముగించేశారు. దాంతో ప్రభాకరరావు మరోసారి స్పందనలో ఫిర్యాదు చేశారు. గతేడాది డిసెంబరు 16న డీఎల్‌పీవో విచారణ చేసి డీపీవోకు నివేదిక ఇచ్చారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగానికి సంబంధించి అప్పటి కార్యదర్శి నాగేంద్ర, సర్పంచి గోపిని బాధ్యుల్ని చేస్తూ సుమారు రూ.32 లక్షలు రికవరీకి నోటీసు ఇచ్చారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన జుజ్జవరపు పద్దాలు (48) అరటి పళ్ల వ్యాపారం చేస్తాడు. శనివారం సాయంత్రం వ్యాపారం నిమిత్తం కడియద్ద వైపు వెళ్ళాడు. పని ముగించుకుని తిరిగి కృష్ణాపురం వస్తుండగా సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కడియద్దలో వేగంగా వచ్చిన కారు ఢీకొంది. పద్దాలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై జేవీఎన్. ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

3ఎఫ్ కర్మాగారంలో కొనసాగుతున్న ఐటీ సోదాలు



ఐటీ సోదాలు జరుగుతున్న సందర్భంగా నిర్మానుష్యంగా ఉన్న ప్రత్తిపాడు 3ఎఫ్ కర్మాగారం

పెంటపాడు: పెంటపాడు మండలం ప్రత్తిపాడులో 3ఎఫ్ కర్మాగారంలో శనివారం కూడా ఐటీ సోదాలు నిర్వహించారు. ఏలూరు నుంచి వచ్చిన ఐటీ అధికారుల బృందం కర్మాగారానికి సంబంధించి పలు దస్త్రాలు పరిశీలించినట్లు సమాచారం. ప్రస్తుతం సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

వైఎస్సార్ సీపీ చేతివృత్తుల విభాగం ఏర్పాటుపై హర్షం

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ ఆర్టిసన్ సెల్ (చేతి వృత్తుల విభాగం) ఏర్పాటు చేయడం హర్షనీయమని, చేతి వృత్తిదారుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఈ సెల్ ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి, తణుకు పట్టణ స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు పాడుగు రామాచారి అన్నారు. ఆధునిక యంత్రాల రాకడతో చేతివృత్తిదారులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఆర్టిసన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా తోలేటి శ్రీకాంత్‌ను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేతివృత్తిదారులకు జగనన్న తోడు, చేదోడు పథకాలు అమలు చేశారని, స్వర్ణకారులకు తరచుగా రసాయనాల వల్ల జరిగే ప్రమాదాలను ఆరోగ్యశ్రీలో పెట్టి ఆదుకున్న విషయం గుర్తు చేశారు. తోలేటి శ్రీకాంత్‌కు స్వర్ణకార సంఘం తరపున అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. కొమ్మోజు రామకృష్ణ, అనుపోజు జగన్నాథం, కర్రి వెంకట్రావు, తమిరి శివకుమార్, రీసు కన్నయ్య హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి పీజీఆర్‌ఎస్ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని ఆర్‌డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావేదిక ఎన్నికల కోడ్ వల్ల నిలుపుదల చేయగా కోడ్ ముగియడంతో ప్రతి సోమవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మగువలు.. మహారాణులు

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- ఇతరులకు స్ఫూర్తిదాయకం
- వేడుకగా మహిళా దినోత్సవం


పతంజలి యోగాలయంలో మహిళా గురువుకు సత్కారం


నిట్‌లో మహిళా దినోత్సవం

తాడేపల్లిగూడెం: ఆకాశంలో సగం, అవనిలో సగం అంటూ అన్ని రంగాలలోనూ పురుషులతో పోటీ పడుతూ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో మహిళలు దూసుకుపోతున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమన్నట్టుగా వివక్షతకు గురైన మహిళలు, నేడు అందరినీ శాసించే స్థాయిలో పదవులను అందుకుంటున్నారు. సమాజానికి దిశ, దశను నిర్దేశించే రీతిలో ఉన్నత స్థాయి అధికారులుగా కూడా రాణిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పలుచోట్ల జరిగిన వేడుకల్లో వక్తలు మహిళా మణుల త్యాగనిరతి, ఔన్నత్యం గురించి కొనియాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానోను సత్కరించారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. మనిషి జీవితాన్ని నిర్మించే పాత్ర ఒక్క మహిళకే ఉందని అతిథిగా హాజరైన డాక్టర్ చిట్యాల పద్మిని అన్నారు. రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి , నిట్ అధికారులు పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే నిజమైన మహిళా సాధికారత అని సీనియర్ సివిల్ జడ్జి, అదనపు సెషన్సు జడ్జి కూనపరెడ్డి మాధవి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అన్నారు. రాజ్యాంగంలో మహిళలకు సమప్రాధాన్యత ఇవ్వడం వల్ల మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. పాలకవర్గ బాధ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యం, ఉద్యోగం వంటి అన్ని రంగాల్లో మహిళల ప్రాధాన్యతను గుర్తించి వారికి అవసరమైన మద్దతు అందించాలని శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంటు మేకా క్రాంతిసుధ, వాప్సైట్ సిద్ధుసోమ, సహవ్యవస్థాపకురాలు అంబటి భార్గవి అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పాంగణంలో ఈ సందర్భంగా ఒక రోజు ప్రిన్సిపాల్ అనే కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు వారు ఎంచుకున్న రంగాల్లో తమ ప్రతిభకనబర్చి ముందుకు దూసుకెళ్తున్నారని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మండలంలోని నందమూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీవోఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ కుటుంబంతో పాటు ప్రజా ప్రతినిధులుగా, ఉన్నత ఉద్యోగులుగా ఎందరో రాణిస్తున్నారని గుర్తు చేశారు. అటువంటి వారిని ఇతర మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అభివృద్ధిలో మహిళల పాత్ర, ఆరోగ్యం ఇతర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ శనగర వరలక్ష్మితో పాటు వివిధ రంగాల్లోని మహిళలను సన్మానించారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ, ఈటీసీ ఫ్యాకల్టీ చక్రపాణి, ఎస్ఐఆర్‌డీపీఆర్ రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసరావు, సర్పంచ్ శనగన వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే, పెదతాడేపల్లి, దండగర్ర గ్రామాల్లోనూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా సిబ్బందిని సన్మానించారు. సర్పంచ్‌లు పోతుల అన్నవరం, పిల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలూ...మీకు జోహార్లు!

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడు తిరుమళ్ల సూరిబాబు అధ్యక్షత వహించారు. ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ బానోను సత్కరించారు. ఇద్దరు బాలికలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు. ఎయిర్ స్ట్రిప్ మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మిచే పట్టణంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. పతాంజలి యోగాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో యెగా గురువు కారుమూరి పార్వతి కుమారిని సత్కరించారు. యోగాచార్యులు ఇంజుమూరు మాధవరావు, గ్రంధి సత్యనారాయణ, కడియాల పరశురామయ్య, యోగా గురువులు, సభ్యులు ఏఈ రామకృష్ణ, బడుగు సుధాకర్, బాకా వెంకటేశ్వరరావు, మహిళా సభ్యులు సుభాషిణి, అరుణ కుమారి, స్మిత, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళల దినోత్సవం

తణుకు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో శనివారం తణుకు వంకా సత్యనారాయణ సురాజ్య భవన్‌లో గౌరవప్రదమైన జీవితం దాతృత్వం కాదు ఇది మహిళల హక్కు అందుకోసం పోరాడుదాం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, శ్రమదోపిడీ, 8 గంటల పని దినం, ఓటు హక్కు సాధన, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళలు, కమ్యూనిస్టు, సోషలిస్టు మహిళలు ప్రపంచ వ్యాప్తంగా సాగించిన పోరాటాల ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని అన్నారు. ఈ సదస్సులో శ్రామిక మహిళలు సావారపు దేవి, ధర్మాని పుష్పలత, మహిళా నాయకురాలు వావిలాల సరళాదేవి, డాక్టర్ వంక వసుంధర, రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి, ఎస్. మనోరమ, భూపతిరాజు ఝాన్సీ సికిలే పుష్పకుమారి, వై. నాగలక్ష్మి లను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి వలవల అరుణ కుమారి, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.నాగలక్ష్మి, వడ్డాది మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సార్ ఎంబీఏ కళాశాలలో ఉమెన్స్ డే వేడుకలు

ఏఎస్సార్ ఎంబీఏ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంబీఏ, బీఈడీ విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్, అధ్యాపకులు జీవన్, భార్గవి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ మహిళలు వారికి ఉన్న హక్కులు, చట్టలు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ పురుషుడు స్త్రీలను గౌవరవించాలన్నారు. ఈ కార్యర్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులు బంగారు ముసలమ్మ, మర్రిపూడి సుజాత, పెనుమాక విజయ, బాదంపూడి గంగలకు సత్కారాలు చేశారు. కమిషనర్ ఏసుబాబు, వివిధ కార్మిక సంఘాలు యూనియన్ల నాయకులు ఏబీ శ్రీనివాస్‌రావు, జగ్గు నిరంజన రామారావు, ధనాల వెంకట్రావు, కార్మికులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.


ఇరగవరం: పోలీస్ స్టేషన్‌లో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం(టీఓసీ): మునిసిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం


తణుకు అర్బన్ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక


మాట్లాడుతున్న నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, న్యాయమూర్తులు

తణుకు అర్బన్: పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదిక అని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 723 కేసులు న్యాయమూర్తులు రాజీ చేశారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు 712, బ్యాంక్, టెలిఫోన్ బకాయిలకు సంబంధించి 11 కేసులు పరిష్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మహిళా న్యాయమూర్తులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కృష్ణసత్యలత, 2వ స్పెషల్ బెంచ్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాది కె.వెంకటేశ్వర్లు, బెంచ్ మెంబర్లు జయచంద్ర ప్రసాద్, నెహ్రూ, జెస్‌పాల్ , రాజేంద్రప్రసాద్, మృత్యుంజయరావు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 524 కేసుల పరిష్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా వెల్లడించారు. శనివారం తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. సికిందర్ బాషా మాట్లాడుతూ సివిల్ కేసులు 29, క్రిమినల్ కేసులు 182, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 13, ప్రీ లిటిగేషన్ కేసులు 16, బెంచ్ కోర్టు కేసులు 284 కేసులు, మొత్తం 524 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. జ్యూడిషియల్ సభ్యులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఎస్.కిరణ్ శ్రీ, నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, అడ్వకేట్ సభ్యులు దూలం విజయకుమార్, బి.వెంకటేశ్వరరావు, టి.మురళీకృష్ణలు వ్యవహరించారు. కోర్టు సిబ్బంది, కక్షిదారులు, పోలీస్ సభ్యులు పాల్గొన్నారు.

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అంజనేయులు, పాల్గొన్న అధికారులు, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పానుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. తద్వారా మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలన్నారు. విద్యుత్ శాఖ అంశంపై జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ జరుగుతుండటంతో సకాలంలో విద్యుత్ సరఫరా చేయాలన్నారు. లేకుంటే రైతుల శ్రమ వృథా అవుతుందన్నారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ మరో 20 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హౌసింగ్ అంశంపై ఏఈ కే.వెంకట్రావు మాట్లాడుతూ స్థలాలు ఉండి ఇల్లు నిర్మించుకునే వారు ఈ నెల 12వ తేది లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, బీసీలకు రూ.50వేలు అదనపు లబ్ధి అందిస్తుందని, దీన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ఎర్ర కాలువ అంశంపై ఏఈ అనిల్ కుమార్ మాట్లాడుతూ ముంపు శాశ్వత నివారణకు రూ.10కోట్లతో, చెరువులకు సంబంధించి రూ.3.20కోట్లు ప్రతిపాదనలు పంపించామన్నారు. విద్య, ఆర్‌డబ్ల్యుఎస్, ఎన్ఆర్ఈజీఎస్, ఆరోగ్య, వెటర్నరీ, ఉద్యాన, పీఆర్ తదితర శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంఈవో వి.హనుమ, ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, వైద్యులు శ్రీహర్ష, కేవీ.వెంకటేష్, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి

అత్తిలి: మండలంలోని మదనగోపాలస్వామి కల్యాణ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు సహకరించాలని ఎస్సై పి ప్రేమరాజు అన్నారు. శనివారం అత్తిలి మండలం బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణపై ఉత్సవ కమిటీ సభ్యులతో ఆలయ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రేమరాజు మాట్లాడుతూ స్వామి వారి రథోత్సవం, పొన్నవాహన గ్రామోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా యువత, ఉత్సవ కమిటీ సభ్యు లు సమన్వయంతో ఉండి ముందుకు నడిపించాలన్నారు. రథోత్సవాన్ని ట్రాక్టర్‌తో కాకుండా గతంలో మాదిరిగా భక్తులే లాగేవిధంగా చేయా లని ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్వామివారి కల్యాణోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు తమవంతు బాధ్యత తీసుకోవాలని ఎస్సై కోరారు. ముందుగా శ్రీస్వామివారిని ఎస్సై పి ప్రేమరాజు, ఏఎస్సై సత్యనారాయణ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ఎల్ శ్రీనివాస్, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ గారపాటి ధర్మయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్దాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, తోట నాగ వెంకట శివ గణేష్, ప్రగడ నాగ వెంకట మణికంఠ గోపాలకృష్ణ, గునుపూడి నరేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, సంతోషం పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని ఐదు సెంటర్లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడులో ఒక సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 2,317 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 2,256 మంది పరీక్షలకు హాజరయ్యారు. 61 మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

లక్ష్యం సాధించాలంటే ఆధ్యాత్మిక శక్తి అవసరం


అష్టావధానం నిర్వహిస్తున్న అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు

అత్తిలి: అవధానం వల్ల తెలుగు భాష విశిష్టత, తెలుగు పద్యాలు అందరికీ తెలుస్తాయని అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో జరుగుతున్న మదనగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవాలలో గీతావధాన దురంధర యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అష్టావధానం నిర్వహించారు. నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, వర్ణన, ఆశువు, గీతావివరణ, అప్రస్తుత ప్రసంగము అనే ఎనిమిది అంశాలతో ఎంతో ఆసక్తి కరంగా అవధానం సాగింది. అడుగడుగునా పొంచి ఉన్న సమస్యలు, అంశాలన్నింటినీ నేర్పుతో ఎదుర్కొనే మేధాప్రక్రియ అవధానమని, ఎంతో పాండిత్యం ఉంటేనే గానీ సాధ్యం కాని అవధానాన్ని ఉమా మహేశ్వరరావు చిన్న వయస్సులోనే సుసాధ్యం చేసుకోవడం ఎంతో ఆనందకరమని సంచాలకులు దాయన సురేష్ చంద్రాజీ అన్నారు. ఈసందర్భంగా అవధాని ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ ప్రబోధించిన భగవద్గీత ప్రతీ ఒక్కరి జీవితానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇందులో ఎన్నో జీవన మూలాలు ఉన్నాయని, వాటిని మనం ఆచరించాలని అని అన్నారు. జీవితంలో ఏలక్ష్యం సాధించాలన్నా దానికి కావాల్సిన ఆధ్యాత్మిక శక్తి భగవద్గీత నుంచి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ఎల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇళ్ల పట్టాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సమస్యలపై ప్రజా చైతన్య సైకిల్ యాత్ర నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కె.ఎ స్.ఎన్ కాలనీలో శనివారం ఇంటింటా ప్రచారాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తూ..

- 650 కుటుంబాల వారు ఏకీకృతమై కేఎస్ఎన్ కాలనీగా నామకరణం
- తాజాగా కేఎస్ఎన్ కాలనీ స్థానే ఇప్పుడు భగత్ సింగ్ కాలనీగా పేరు మార్పు


తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీ ఆర్చ్‌పై భగత్‌సింగ్ కాలనీగా పేరు మార్చిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తూ కొంతమంది వ్యక్తుల చర్యలు విస్మయానికి గురి చేస్తున్నాయి. ఈ క్రమంలో గత నెల 20వ తేదిన మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీ వద్ద ఉన్న శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఇదే మాదిరిగా అప్పారావుపేట – కృష్ణాపురం రహదారి శిలాఫలకాన్ని, మాధవరం, జగ్గన్నపేట, జగన్నాథపురం, రామన్నగూడెం గ్రామాల్లోనూ సైతం శిలాఫలకాన్ని కూల్చివేశారు. తాజాగా ప్రస్తుతం ఉన్న కొండ్రుప్రోలు కాలనీ ప్రవేశ ద్వారం వద్ద కేఎస్ఎన్ కాలనీ పేరును మారుస్తూ భగత్‌సింగ్ కాలనీగా ఏర్పాటు చేశారు. ఇది కాలనీవాసుల ఆకాంక్షలకు తూట్లు పొడిచే విధంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని శివాలయం వీధి, రైల్వే ట్రాక్ పక్కన, బలుసులమ్మ గుడి ప్రాంతాల్లో గూడు లేక అలమటిస్తున్న వారికి నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి సహకారంతో అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ కొండ్రుప్రోలులో కాలనీ నిర్మాణం చేశారు. దీనిని 2004వ సంవత్సరంలో నాటి ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న కొణిజేటి రోశయ్య ప్రారంభించారు.

దీంతో స్థానికులంతా ఏకస్తులై ఒక కమిటీగా ఏర్పడి కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీగా రిజిస్టర్ చేశారు. నాటి నుంచి అదే పేరుతో కొనసాగుతూ వస్తోంది. ఇదే కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రతీకగా ఆర్చ్ వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. దీనినే గత నెల ధ్వంసం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను సంరక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు మిన్నకుండటంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా, ఇటువంటి చెడు సంస్కృతికి ఫుల్‌స్టాప్ పెట్టాలని పలువురు కాలనీ వాసులు కోరుతున్నారు.